






ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం


స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 353 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
సోమవారం 21 జూలై 2025

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# దుబాయ్‌ని చూస్తుంటే నాకు అసూయ వేస్తుంది:సీఎం చంద్రబాబు

**విజయవాడ, జూలై 23, (రిపబ్లిక్ న్యూస్):** ఎడారి నుంచి స్వర్గాన్ని సృష్టించిన దేశం దుబాయ్.. ఆ దేశాన్ని చూస్తుంటే తనకు అసూయ వేస్తుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ సదస్సుకు సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "దుబాయ్ లో ఎడారి ప్రాంతాలు, బీచ్లు పర్యాటకులకు ఆహ్లాదకర అనుభూతిని కలిగిస్తాయి. యూఏఈ అభివృద్ధిలో భారత్ భాగస్వామ్యం ఉండటం సంతోషకరం. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకుంటేనే అభివృద్ధి సాధ్యం.



నూతనంగా ఆలోచించడం వల్లే కొత్త ఆవిష్కరణలు పుట్టుకొస్తున్నాయి. యూఏఈతో భారత్కు మంచి సంబంధాలు ఉన్నాయి. అక్కడి జనాభాలో 40శాతం మంది భారతీయులే. 1991లో ఆర్థిక సంస్కరణలు, 1995లో టెక్నాలజీ రివల్యూషన్తో పరిస్థితి మారింది. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో భారత్కు అపార అవకాశాలు వచ్చాయి. వికసిత్ భారత్ ద్వారా 2047 నాటికి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. ఉమ్మడి ఏపీలో విజన్ 2020 రూపొందించి రాష్ట్రాభివృద్ధి మెరుగుపరిచాం. రాష్ట్రంలో 2026 జనవరి నాటికి క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ ఏర్పాటు చేస్తాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 575 సేవలు అందిస్తున్నాం. ఏ పని కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండదు. ఆగస్టు 15 నాటికి అన్ని సేవలు ఆన్లైన్లోనే అందుబాటులోకి తీసుకొస్తున్నాం. మెరుగైన సాంకేతికతతో అద్భుతాలు సృష్టించే కాలమిది. ఆరోగ్యం, సంపద, సంతోషకర సమాజ స్థాపనే మా లక్ష్యం. ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యంతో రహదారుల వంటి అన్ని పనులు చేస్తున్నాం" అని తెలిపారు.

"కొత్తగా పీ4 విధానం తీసుకొస్తున్నాం.. పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్టనర్షిప్. లులు మాల్ అంతర్జాతీయంగా రిటైల్ కేంద్రాలు నిర్వహిస్తోంది. దావోస్లో నాలుగైదు సార్లు లులు మాల్ ప్రతినిధులను కలిసి ఏపీలో పెట్టుబడులు పెట్టాలని కోరాం. విజయవాడ, విశాఖలో లులు మాల్స్ ఏర్పాటుకు ఆ సంస్థ ముందుకొచ్చింది. భవిష్యత్ అంతా గ్రీన్ ఎనర్జీదే. గ్రీన్ హైడ్రోజన్,

## మొట్ట మొదటి హైడ్రోజన్ వ్యాలీ ఏపీనే..

అమ్మోనియా ఎగుమతులకు విశాఖ, కాకినాడకు విస్తృత అవకాశాలు ఉన్నాయి. మొట్ట మొదటి హైడ్రోజన్ వ్యాలీ ఏపీనే. గ్రీన్ ఎనర్జీలో ఆకాశమే హద్దుగా అవకాశాలు ఉన్నాయి. త్వరలోనే గూగుల్ విశాఖలో అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఆరోగ్య రంగంలోనూ బిల్గేట్స్ ఫౌండేషన్తో పనిచేస్తున్నాం. సుందరమైన హరిత నగరంగా అమరావతిని నిర్మిస్తాం. ఈ ఏడాది 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షిస్తాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం మార్చుకున్నాం. రాష్ట్రంలో మౌలిక వసతులకు ఎలాంటి కొరత లేదు. పోర్టులు, ఎయిర్పోర్టులు, మౌలిక సదుపాయాలు ఉన్నాయి. నీటి వనరుల పరంగా, వ్యవసాయ రంగంలో ఏపీ అగ్రస్థానంలో ఉంది" అని సీఎం వివరించారు. సదస్సుకు పలు దేశాల ప్రతినిధులు హాజరై పెట్టుబడి అవకాశాలు, ఆర్థికాభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు.

# పవనన్న స్వాగ్ నాకు చాలా ఇష్టం:మంత్రి లోకేశ్

**అమరావతి, జూలై 23, (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' సినిమాపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. "మా పవన్ అన్న సినిమా విడుదల సందర్భంగా చిత్ర నిర్మాణంలో పాలుపంచుకున్న బృందానికి అభినందనలు.



పవర్ స్టార్ అభిమానుల్లాగే నేనూ సినిమా ఎప్పుడెప్పుడు చూద్దామా అని ఎదురుచూస్తున్నాను. పవనన్న, ఆయన సినిమాలు, స్వాగ్ నాకు చాలా చాలా ఇష్టం. పవర్ స్టార్ పవర్ఫుల్ పెర్ఫార్మెన్స్తో 'హరిహర వీరమల్లు' అద్భుత విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని లోకేశ్ తెలిపారు.

# పార్లమెంట్‌లో 'ఆపరేషన్ సిందూర్'పై చర్చకు డేట్ ఫిక్స్

**ఢిల్లీ, జూలై 23, (రిపబ్లిక్ న్యూస్):** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను కుదిపేస్తున్న పహల్గాం ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్' అంశాలపై చర్చకు గ్రీన్ సిగ్నల్ పడింది. జులై 29న ఉభయసభల్లో దీనిపై సుదీర్ఘంగా చర్చ జరపనున్నట్లు తెలుస్తోంది. లోక్సభలో 16 గంటలు, రాజ్యసభలో 9 గంటల పాటు దీనిపై ఎంపీలు మాట్లాడనున్నట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. బుధవారం జరిగిన పార్లమెంట్ బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.



ఈ ఏడాది ఏప్రిల్ లో జమ్మూకశ్మీర్లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. పాకిస్థాన్, పీఓకేలోని ఉగ్ర శిబిరాలే లక్ష్యంగా మెరుపుదాడులు చేసింది. అత్యంత కచ్చితత్వంలో కీలక ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. దీనికి ప్రతిగా పాకిస్థాన్ కూడా భారత్ పైకి డ్రోన్లు, క్షిపణలు పంపించింది. దీంతో ఇరుదేశాల మధ్య కొన్ని రోజుల పాటు భీకర ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం పాక్ అభ్యర్థన మేరకు భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది. అయితే, ఈ రెండు దేశాల మధ్య యుద్ధాన్ని తానే ముగించానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదే పదే ప్రకటించుకుంటున్నారు. దీంతో అగ్రరాజ్య ఆరోపణలపై పార్లమెంట్ సమావేశాల్లో సహా విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలు, పహల్గాం దాడి వెనక నిఘా వైఫల్యం వంటి ఆరోపణలపై భారత ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని పట్టుబడుతున్నాయి. విపక్షాల నిరసనలతో పార్లమెంట్ కార్యకలాపాలకు అంతరాయం కలుగుతోంది. ఈనేపథ్యంలో దీనిపై చర్చకు తాజాగా తేదీని నిర్ణయించారు. ప్రస్తుతం ప్రధాని మోదీ విదేశీ పర్యటనకు వెళ్లారు. మాల్దీవులు, యూకే పర్యటన ముగించుకొని జులై 26న స్వదేశానికి తిరిగొస్తున్నారు. దీంతో జులై 29న లోక్సభలో జరిగే చర్చలో ప్రధాని పాల్గొనే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

# మహాలక్ష్మి పథకంతో లాభాల్లోకి తెలంగాణ ఆర్టీసీ:భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూలై 23, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణలో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం తెచ్చినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తయిన సందర్భంగా ఎంజీబీఎస్ లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం ద్వారా నేడు ఆర్టీసీ లాభాల్లోకి వచ్చిందన్నారు. 200 కోట్ల ప్రయాణాలతో రూ.6 వేల కోట్లు ఆర్జించిందన్నారు. కాంగ్రెస్ హయాంలో ఆర్టీసీ బలోపేతం అవుతోందని పేర్కొన్నారు. ఆక్యుపెన్సీ రేటు ఒకప్పుడు 67 శాతం ఉంటే ఈరోజు 97 శాతానికి వచ్చిందన్నారు. ఆర్టీసీ ఇటీవల వేల సంఖ్యలో కొత్త బస్సులు కొన్నట్లు తెలిపారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఖర్చుకు వెనకాడకుండా ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు.

## గత పాలకులు ఆర్టీసీని విధ్వంసం చేశారు:మంత్రి పొన్నం



ఆర్టీసీలో కొత్తగా నియామకాలు జరుగుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామన్నారు. ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల్లోకి వచ్చిందని పేర్కొన్నారు. సంస్థలో పెండింగ్ బకాయిలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలతో బస్సులు కొనుగోలు చేయిస్తున్నామన్నారు. గత పాలకులు పదేళ్లు ఆర్టీసీని విధ్వంసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు విద్యుత్ శాఖ సిద్ధంగా ఉండాలి:మంత్రి గొట్టిపాటి

**రాజమహేంద్రవరం, జూలై 23, (రిపబ్లిక్ న్యూస్):** క్షేత్రస్థాయిలో సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్ (విద్యుత్ పంపిణీ సంస్థల పునర్వ్యవస్థీకరణ పథకం) పనులు వేగవంతం చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.



ఇందులో ఎమ్మెల్యేలు బుచ్చయ్య చౌదరి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్ పనుల తీరును మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. పీఎం సూర్యఘర్పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రైతులకు వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు. గోదావరి పుష్కరాలకు విద్యుత్ శాఖ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

# రియల్టర్ల మధ్య విభేదాలతో కిడ్నాప్.. తండ్రీకుమారుల దారుణ హత్య

**సంతమాగులూరు, జూలై 23, (రిపబ్లిక్ న్యూస్):** బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం పాతమాగులూరులో జంట హత్యలు కలకలం రేపాయి. పాతమాగులూరులోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్లో తండ్రి, కుమారుడి మృతదేహాలను పోలీసులు గుర్తించారు.



బెంగళూరుకు చెందిన కె.వీరాస్వామిరెడ్డి (62), అతని కుమారుడు కె. వి. ప్రసాదరెడ్డి (37) నిన్న సాయంత్రం కోర్టు పనిమీద పల్నాడు జిల్లా నరసరావుపేటకు వచ్చారు. బుధవారం ఉదయం నరసరావుపేట కోర్టుకు బయలుదేరుతున్న క్రమంలో రెండు వాహనాల్లో వచ్చిన ఆరుగురు వ్యక్తులు.. తండ్రి, కుమారుడిని కిడ్నాప్ చేశారు. అక్కడి నుంచి పాతమాగులూరులోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్లోలోకి తీసుకెళ్లి ఇద్దరినీ హత్య చేసి పరారయ్యారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య విభేదాలే హత్యలకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి మాధవ రెడ్డి.. ఇద్దరినీ హత్య చేయించినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

# రూ.69లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నాం:సీపీ సీవీ ఆనంద్

**హైదరాబాద్, జూలై 23, (రిపబ్లిక్ న్యూస్):** నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్న 9 మందిని హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్ (హెచ్న్యూ) పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కొకైన్ సరఫరా చేస్తున్న ఆరుగురు, మెఫిడ్రీన్ సరఫరా చేస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు.

నిందితుల నుంచి 286 గ్రాముల కొకైన్, 11 గ్రాముల ఎక్స్టసీ, తుపాకీ, 12 సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ కేసు వివరాలను సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. "డ్రగ్స్ కేసులో రవివర్మ, సచిన్ అనే ఇద్దరు కీలక వ్యక్తులను పట్టుకుని వారి నుంచి ముఖ్యమైన సమాచారం సేకరించాం. రవివర్మకు ముంబయికి చెందిన ముఠాతో సంబంధాలున్నాయి. అక్కడ ఉన్న వాహిద్ అనే వ్యక్తికి విదేశాల నుంచి కొకైన్ వస్తోంది. అతడి నుంచి నిందితులు హైదరాబాద్కు డ్రగ్స్ తీసుకొస్తున్నారు. ప్రేమ్ ఉపాధ్యాయ్ అనే వినియోగదారుడిని అరెస్ట్ చేయడంతో ఈ ముఠా గుట్టురట్టయింది. నిందితుల నుంచి రూ.69లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నాం. కాటేదాన్లో డ్రగ్స్ దందా చేస్తున్న రాజస్థాన్కు చెందిన పవన్ భాటీని కూడా అరెస్ట్ చేశాం. హేమ్ సింగ్ అనే మరో వ్యక్తితో కలిసి పవన్ భాటీ డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. నిందితులు ముందు జాగ్రత్తగా రివాల్వర్, బుల్లెట్లు కూడా కొనుగోలు చేశారు" అని సీపీ వివరించారు.



# తిరుపతిలో సెప్టెంబరు 14,15 తేదీల్లో మహిళా సాధికారిక కమిటీ సమావేశాలు

**అమరావతి, జూలై 23, (రిపబ్లిక్ న్యూస్):** తిరుపతిలో సెప్టెంబరు 14, 15 తేదీల్లో మహిళా సాధికారిక కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు తెలిపారు. సమావేశాల నిర్వహణపై సన్నాహక సమావేశం అనంతరం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ మీడియాతో మాట్లాడారు. ఒక్కో రాష్ట్రం నుంచి ఏడుగురు కమిటీ సభ్యులు హాజరవుతారని, మహిళా సమస్యలపై చర్చలు ఉంటాయని తెలిపారు. మహిళా సాధికారతకు సీఎం చంద్రబాబు పెద్దపీట వేశారని, తిరుపతి జిల్లా ప్రాశస్త్యం అందరికీ తెలిసేలా సమావేశాలు నిర్వహిస్తామన్నారు.



# శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద.. రెండు గేట్లు ఎత్తి నీరు విడుదల

**సున్నిపెంట, జూలై 23, (రిపబ్లిక్ న్యూస్):** పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జలాశయం రెండు రేడియల్ క్రస్ట్ గేట్లను 10 అడుగుల పైకెత్తి స్పిల్వే ద్వారా 55,048 క్యూసెక్కులు.. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 66,948 క్యూసెక్కులను అదనంగా నాగార్జున సాగర్కు విడుదల చేస్తున్నారు. ఎగువ పరివాహక ప్రాంతాలైన జూరాల నుంచి 39,168, సుంకేసుల జలాశయం నుంచి 36,975 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయానికి 883.80 అడుగులు ఉండగా.. నీటి నిల్వ 208 టీఎంసీలుగా నమోదైంది.





printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# లైన్ క్లియర్.. ఓవర్సీస్లో గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమైన 'హరి హర వీరమల్లు'



ఐదేళ్ల ఎదురుచూపులకు మరికొన్ని గంటల్లో తెర పడనుంది. అగ్ర కథానాయకుడు పవన్ కల్యాణ్ హీరోగా నటించిన 'హరి హర వీరమల్లు' ఈరోజు రాత్రి నుంచి ప్రేక్షకులను అలరించనుంది. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో టికెట్లు హాట్కేకుల్లా అమ్ముడవుతున్నాయి. అయితే, ఓవర్సీస్ లో ఈ సినిమా విడుదల విషయంలో ఇటీవల చిన్న గందరగోళం ఏర్పడిన సంగతి తెలిసిందే. డిజిటల్ ప్రింట్ అందలేదని విదేశీ నిర్మాణసంస్థ పోస్ట్ పెట్టింది. దీంతో కొందరు అభిమానులు ఆందోళన చెందారు.తాజాగా లైన్ క్లియర్ అయిందని తెలుపుతూ సదరు సంస్థ పోస్ట్ పెట్టింది. ఓవర్సీస్లో అన్ని లొకేషన్లకు ప్రింట్లు వచ్చేశాయని పేర్కొంది. ఈ సినిమా ఫస్ట్ హాఫ్ 1గంట 26 నిమిషాల 40 సెకన్లు అని, సెకండ్ఫ 1గంట 18 నిమిషాల 25 సెకన్లు అని తెలిపింది. ఈ చిత్రం ప్రదర్శించనున్న థియేటర్ల లిస్ట్ను సోషల్ మీడియాలో షేర్ చేసింది. వీరమల్లు విధ్వంసం చూసేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపింది. పవన్ కల్యాణ్ హీరోగా క్రిష్. జ్యోతికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా విజయం సాధించాలని అభిమానులు పూజలు చేస్తున్నారు. పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్గా ఇది సిద్ధమైంది. పవన్ ఇందులో చారిత్రక యోధుడిగా మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్. బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తొలిభాగం 'హరి హర వీరమల్లు: పార్ట్ 1- స్వార్డ్ వర్సెస్ స్పిరిట్ పేరుతో విడుదల కానుంది.


## రతన్ టాటా కూడా పెళ్లి చేసుకోలేదు కదా:నిత్యామేనన్



సెలక్టివ్ సినిమాలు చేస్తూ అభిమానులను సొంతం చేసుకున్నారు నటి నిత్యా మేనన్. ప్రస్తుతం ఆమె నటించిన 'సార్ మేడమ్' విడుదలకు సిద్ధంగా ఉంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రేమపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ప్రపంచంలో ప్రతిఒక్కరికీ ప్రేమ వివాహం చేసుకోవడం సాధ్యం కాదన్నారు. "ప్రేమ గురించి ఎన్నో సంవత్సరాల క్రితం ఆలోచించాను. ఇప్పుడు దానికి నా జీవితంలో అధిక ప్రాధాన్యం ఇవ్వడం లేదు. తల్లిదండ్రులు, కుటుంబం, సమాజం కారణంగా సోల్మేట్ ఉండడం అనివార్యమని గతంలో అనిపించేది. అతడిని వెతికిన సందర్భాలూ ఉన్నాయి. అయితే మనం వేరేరకంగా కూడా జీవితాన్ని ఆనందించవచ్చని తర్వాత అర్థం చేసుకున్నాను. ప్రతిఒక్కరికీ ప్రేమించిన వ్యక్తినే జీవిత భాగస్వామిగా చేసుకోవడం సాధ్యం కాదు కదా!. రతన్ టాటా కూడా వివాహం చేసుకోలేదు. పెళ్లి అనేది జీవితంలో ఓ భాగం మాత్రమే.. అది జరిగినా.. జరగకపోయినా మార్పు ఉండదు. తోడు లేనందుకు ఒక్కోసారి బాధ కలిగినప్పటికీ, స్వేచ్ఛగా జీవిస్తున్నందుకు ఆనందంగా ఉంది. జీవితంలో జరిగిన కొన్ని అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాల కారణంగానే నేను ప్రస్తుతం ఈ స్థితిలో ఉన్నాను. ఏది జరిగినా మన మంచికే అనుకొని ముందుకుసాగాలి" అని నిత్యామేనన్ తెలిపారు. ప్రస్తుతం నిత్యా మేనన్ 'సార్ మేడమ్'తో పలకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. పాండిరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా జులై 25న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల విడుదలైన దీని ట్రైలర్ విశేషంగా ఆకట్టుకుంది. ఓ మధ్యతరగతి కుటుంబంలోని భార్యాభర్తల పాత్రల్లో నిత్యామేనన్, విజయ్ సేతుపతి ఎంతో సహజంగా నటించారంటూ, వారి కెమిస్ట్రీపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## నేను 12 గంటలైనా వర్క్ చేయగలను..: విద్యాబాలన్



కొన్ని రోజులుగా చర్చనీయాంశంగా మారిన వర్కింగ్ అవర్స్ అంశంపై నటి విద్యాబాలన్ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. కొత్తగా తల్లి అయిన వారికి పరిమిత పని గంటలు ఉండాలని ఆమె అన్నారు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. ఈ విషయంపై మాట్లాడారు. దీపికా పదుకొణె ఎక్కువ పని గంటల కారణంగా ఓ భారీ ప్రాజెక్ట్ను వదులుకున్నట్లు వచ్చిన వార్తలపై స్పందించారు. కొత్తగా తల్లి అయిన వారికి మద్దతు ఇవ్వాలని దీనికోసం సానుభూతితో కూడిన పని సంస్కృతి అవలంబించాల్సిన అవసరం ఉందని విద్యాబాలన్ అన్నారు. "బిడ్డకు జన్మనిచ్చిన మహిళలు కుటుంబంతో ఎక్కువ సమయం గడపాలి. వారికి బాధ్యతలు ఎక్కువ ఉంటాయి. అలాంటి వారికి అవకాశం ఇవ్వాలంటే కచ్చితంగా కొన్ని మార్పులు చేయాల్సిందే. వారికి అనువైన పని గంటలు ఉండడం చాలా ముఖ్యం. వారితో పోలిస్తే నాలాంటి వారికి బాధ్యతలు తక్కువగా ఉంటాయి కాబట్టి ఎక్కువ సమయాన్ని షూటింగ్లకు కేటాయించగలం. నేను 12 గంటలైనా చిత్రీకరణలో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నాను. ప్రపంచంలో ఏ ప్రాంతంలో షూటింగ్ చేసినా పాల్గొనగలను" అని విద్యాబాలన్ స్పష్టంచేశారు. ఇన్నేళ్ల కెరీర్లో లో ఎంతో ఒత్తిడికి గురైనట్లు విద్యాబాలన్ చెప్పారు. ప్రస్తుతం ఒత్తిడికి దూరంగా ఉంటూ సమయాన్ని ఆస్వాదిస్తున్నట్లు తెలిపారు. తన వద్దకు వచ్చిన స్క్రిప్టను పరిశీలించి ఓకే చేస్తున్నట్లు చెప్పారు. రెండు సినిమాలు అంగీకరించానని త్వరలోనే వాటి వివరాలు తెలుపుతానని అన్నారు. 2005లో 'పరిణీత' సినిమాతో విద్యాబాలన్ బాలీవుడ్లోకి అడుగుపెట్టారు. సిల్క్ స్మిత జీవితకథ ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'ది డర్టీ పిక్చర్ తో విద్యాబాలన్కు మంచి గుర్తింపు వచ్చింది. చివరిగా కార్తిక్ ఆర్యన్ హీరోగా నటించిన 'భూల్ భూలయ్యా 3'లో కనిపించారు. ఈ సినిమా రూ.400 కోట్లకు పైగా వసూలు చేసి బాలీవుడ్లో గతేడాది విడుదలైన చిత్రాల్లో టాప్లో నిలిచింది.


ప్రజా రిపబ్లిక్ దిన పత్రిక
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

## చరిత్రలో నేటి ప్రత్యేకత


- 1856: భారత జాతీయోద్యమ పిత బాలగంగాధర్ తిలక్ జననం (మ.1920). (చిత్రంలో)
- 1906: భారత స్వాతంత్ర ఉద్యమకారుడు చంద్రశేఖర్ ఆజాద్ జననం (మ.1931).
- 1953: ఇంగ్లాండుకు చెందిన ప్రముఖ క్రికెట్ క్రీడాకారులలో ఒకడైన గ్రాహం గూచ్ జననం.
- 1975: ప్రముఖ తమిళ నటుడు సూర్య జననం.
- 1983: తమిళనాడులోని కల్పాక్కం అణు విద్యుత్ కేంద్రంలో మొదటి సారిగా ఉత్పత్తి మొదలయ్యింది.
- 2004: భారతీయ నటుడు, దర్శకుడు, నిర్మాత మెహమూద్ మరణం (జ.1932).



బాలగంగాధర్ తిలక్



చంద్రశేఖర్ ఆజాద్




గ్రాహం గూచ్



సూర్య



కల్పాక్కం



మెహమూద్

రిపబ్లిక్ స్పోర్ట్స్

## ట్రంప్ ఆదేశాలు..

### 'ఒలింపిక్స్'లో ఇమానె ఖెలిఫ్ ఉదంతాలు ఉండవ్!



పారిస్ ఒలింపిక్స్ సమయంలో అల్జీరియా బాక్సర్ ఇమానె ఖెలిఫ్ ఉదంతం సంచలనం రేపింది. మహిళలకు సంబంధించిన బాక్సింగ్ పోటీల్లో 'ఆమె'ను ఎలా అనుమతిస్తారని పెద్దఎత్తున చర్చ జరిగింది. అయితే, లాస్ ఏంజెలెస్ లో మాత్రం అలాంటి ఘటనలు ఉండకపోవచ్చు. ఒలింపిక్స్ 2028 పోటీలు లాస్ ఏంజెలెస్ వేదికగానే జరగనున్నాయి. ట్రాన్స్ జెండర్ల విషయంలో అమెరికా ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తోన్న సంగతి తెలిసిందే. తమ సైన్యంలో ట్రాన్స్‌జెండర్ లక్షణాలను కలిగినవారిని పక్కన పెట్టాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. అదే సమయంలో క్రీడల్లోనూ ట్రాన్స్ జెండర్లను మహిళలతో పోటీపడకుండా ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. ఈ ఆర్డర్ను ఖరారు చేస్తూ యూఎస్ ఒలింపిక్ కమిటీ తన వెబ్సైట్లో ఉంచింది. అన్ని దేశాల క్రీడా గవర్నింగ్ బాడీలకు ఈ సమాచారం అందించింది. దీన్ని ఎవరైనా అతిక్రమించేందుకు ప్రయత్నిస్తే 'నిధులను' రద్దు చేస్తామని హెచ్చరించింది. "ఫెడరల్ వ్యవస్థలో సంస్థగా ఉన్న మాకు దానికి అనుగుణంగా ఉండాల్సిన బాధ్యత ఉంది. మా సవరించిన విధానం ప్రకారం.. మహిళలకు న్యాయమైన, సురక్షితమైన పోటీ వాతావరణాన్ని కల్పించడం మా ప్రాముఖ్యతను బలంగా చెబుతోంది. ఇతర దేశాల క్రీడాపాలక సంస్థలు వాటిని అమలుచేసేలా పాలసీలను అప్డేట్ చేసుకోవాలి" అని యూఎస్ ఒలింపిక్ కమిటీ సీఈవో సారా హిర్షాండ్, అధ్యక్షురాలు జెనె సైక్స్ ఓ లేఖలో వెల్లడించారు.

### సొంత రూల్స్ పెట్టుకొనేందుకు ఐవోసీకి అవకాశం


కొత్త ప్రెసిడెంట్ కిర్ కోవెంట్రీ నేతృత్వంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీకి మహిళ అర్హత కీలక అంశం. అయితే, ఒలింపిక్స్లో వ్యక్తిగత క్రీడా సమాఖ్యలకు సొంత నియమాలను ఏర్పాటుచేసుకోవడానికి ఐవోసీ అనుమతినిచ్చింది. ఇప్పటికే కొన్ని సంఘాలు దీనిపై చర్యలు తీసుకోవడం ప్రారంభించాయి. అమెరికాలోని ఎన్సీఏఏ ట్రాన్స్‌జెండర్ అథ్లెట్లకు సంబంధించి నిబంధనలను మార్చింది. బాలికలు, మహిళా క్రీడా పోటీల నుంచి ట్రాన్స్ జెండర్ అథ్లెట్లను నిషేధిస్తూ డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికే కార్యనిర్వాహక ఉత్తర్వులను జారీ చేసిన సంగతి తెలిసిందే. వాటిని అమలుచేస్తూ ఎన్సీఏఏ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

## అందం


### అన్‌వాంటెడ్ హెయిర్‌ని రిమూవ్ చేయకుండానే ముఖాన్ని మెరిపించే బ్లీచ్, ఇంట్లోనే ఎలా వేయాలంటే

చర్మంపై టాన్ పేరుకుపోతే ముఖం కాంతిహీనంగా మారి చూడ్డానికి ఇబ్బందిగా ఉంటుంది. చర్మానికి ఎక్కువగా ఎండ తగిలినప్పుడు ఇలా నలుపు ఏర్పడుతుంది. దీనిని సహజంగానే ఎలా దూరం చేసుకోవాలో తెలుసుకోండి.

సాధారణంగా ప్రతీ చర్మ కూడా ప్రత్యేకమే. ఒక్కో రంగు ఒక్కో అందాన్ని కలిగి ఉంటుంది. కానీ, పర్యావరణ కాలుష్యం, ఎండలో ఎక్కువగా ఉండడం, ఆహారపు అలవాట్లు సరిగా లేకపోవడం, మందులు ఎక్కువగా తీసుకోవడం వల్ల ముఖంపై టాన్ పేరుకుపోయి చర్మంపై సహజ రంగు తగ్గి కాంతిహీనంగా మారుతుంది. దీనిని దూరం చేసి సహజ మెరుపుని అందించేందుకు బ్లీచింగ్ హెల్ప్ చేస్తుంది. స్పా, బ్యూటీ పార్లర్స్‌కి రెగ్యులర్‌గా వెళ్తే అక్కడి ఎక్స్‌పర్ట్స్ బ్లీచ్ తర్వాతే మిగతా ట్రీట్‌మెంట్ తీసుకోవాలని సూచిస్తున్నారు. అయితే, బ్లీచ్‌లలో చాలా రకాలు ఉంటాయి. అందులో మార్కెట్‌లో రెడీ టూ యూజ్ ఫేషియల్స్ కూడా ఉంటాయి. కానీ, వీటిలో హైడ్రోజెన్ పెరాక్సైడ్ ఉంటుంది. ఇది బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. ఈ ప్రొడక్ట్స్ అప్పర్ లిప్, చిన్ భాగాల్లో వెంట్రుకల్ని తెలిగ్గా మార్చి చర్మాన్ని బ్రైట్‌గా చేస్తాయి. అందుకే, బ్లీచ్ వేసుకోవడం మంచిది. అయితే, దీనికోసం పార్లర్స్‌కే వెళ్లాల్సిన అవసరం లేదు. ఇంట్లోనే బ్లీచ్ వేసుకుని మీ చర్మాన్ని మెరిపించొచ్చు.



### ఫేషియల్ బ్లీచ్‌తో బెనిఫిట్స్



ఫేషియల్ బ్లీచ్ మన చర్మంపై పేరుకుపోయిన టాన్‌ని తొలగించి చర్మాన్ని కాంతివంతంగా చేస్తుంది. దీని వల్ల ఇన్‌స్టంట్ గ్లో మీ సొంతమవుతుంది. దీనిని వాడడం వల్ల అన్‌వాంటెడ్ హెయిర్ తగ్గదు. కానీ, ఆ అన్‌వాంటెడ్ హెయిర్‌ని బ్రైట్‌గా మార్చి షేవింగ్, థ్రెడ్డింగ్ అవసరం ప్రతీసారి లేకుండా చేస్తుంది. దీన్ని వేసుకోవడం వల్ల నల్ల మచ్చలు తగ్గుతాయి. స్పాట్ లెస్ స్కిన్ మీ సొంతమవుతుంది. అందుకోసం, నేచురల్ బ్లీచ్‌లను ఎలా అప్లై చేయాలో తెలుసుకోండి.

### పెరుగు, ఓట్స్



కావాల్సిన పదార్థాలు
2 టీస్పూన్ల పుల్లని పెరుగు
1 టీ స్పూన్ ఓట్స్‌ని గరుకుగా మిక్సీ పట్టాలి.
ఏం చేయాలి
ముందుగా ఓట్స్ పౌడర్‌ని ఓ గిన్నెలో వేయాలి.
దీనిలోనే పుల్లని పెరుగు వేసి కలపాలి.
దీనిని ముఖంపై రాసి 15 నిమిషాల పాటు అలానే ఉంచాలి.
తర్వాత మృదువుగా మసాజ్ చేస్తూ నీటితో క్లీన్ చేసుకోవాలి.

### ఎలా పనిచేస్తుంది?



పెరుగులో మాయిశ్చరైజింగ్ గుణాలు ఉన్నాయి. ఇవి స్కిన్‌టోన్‌ని పెంచి డార్క్ సర్కిల్స్‌ని తగ్గిస్తాయి. ఇందులోని లాక్టిక్ యాసిడ్, ఆల్ఫా హైడ్రాక్సీ యాసిడ్ వంటి గుణాలు ట్యాన్‌ని తగ్గిస్తాయి. ఓట్స్ నేచురల్ స్క్రబ్‌లా పనిచేస్తుంది. దీని వల్ల పోర్స్ ఓపెన్ అవుతాయి. స్కిన్ ఎక్స్‌ఫోలియేట్ అయి డెడ్ స్కిన్ సెల్స్ దూరమవుతాయి.

### నిమ్మ, తేనెతో



కావాల్సిన పదార్థాలు
2 టీస్పూన్ల నిమ్మరసం1 టీస్పూన్ నేచురల్ తేనె
ఏం చేయాలి
ఓ బౌల్‌లో నిమ్మరసం, తేనె వేయాలి. దీనిని చక్కగా కలపాలి. దీనిని ముఖానికి, మెడపై పల్చని మాస్క్‌లా వేయాలి. మరో విధంగా వేయాలంటే కాటన్ బాల్స్‌ని ప్యాక్‌లో ముంచి ముఖం మొత్తానికి పట్టించాలి.
ముఖం మొత్తం ఆరేవరకూ ఉండి. ఆ తర్వాత నీటితో క్లీన్ చేయాలి.
తర్వాత అలానే ఆరనివ్వాలి.

### ఎలా పనిచేస్తుంది?



నిమ్మలో అసిడిక్ గుణాలు ఉన్నాయి. ఇది ట్యాన్‌ని తగ్గిస్తాయి. దీని వల్ల ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. ఇందులోని విటమిన్ సి వయసు పెరగడం వల్ల వచ్చే ముడతల్ని తగ్గిస్తాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ గుణాలు స్కిన్‌ని బ్రైట్‌గా చేస్తాయి. అదే విధంగా, తేనె డ్యామేజ్డ్ స్కిన్ సెల్స్‌ని రిపేర్ చేస్తాయి. స్కిన్‌ని మాయిశ్చరైజ్ చేస్తాయి. దీని వల్ల స్కిన్ స్మూత్‌గా మారుతుంది.

### పసుపు, నారింజ తొక్కల పొడి



కావాల్సిన పదార్థాలు
1 టీస్పూన్ కస్తూరి పసుపు1 టీస్పూన్ నారింజ తొక్కల పొడి
ఏం చేయాలి
ఓ గిన్నెలో కస్తూరి పసుపు, నారింజ తొక్కల పొడి వేసి అందులో కొద్దిగా చల్లని నీరు పోసి కలపాలి. దీనిని ప్యాక్‌లా ముఖంపై రాయండి. ఈ ప్యాక్‌ని పూర్తిగా ఆరనివ్వండి. తర్వాత ముఖాన్ని నీట్‌గా కడగాలి.

### ఎలా పనిచేస్తుంది?



కస్తూరి పసుపులో గుణాలు డార్క్ ప్యాచెస్‌ని తగ్గించి నేచురల్ గ్లోని మీ సొంతం చేస్తాయి. నారింజ పొడిలో యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబయల్ గుణాలు ఉన్నాయి. ఇవన్నీ స్కిన్‌ని ఆరోగ్యంగా చేసి ట్యాన్‌ని దూరం చేస్తాయి. యాక్నేని తగ్గిస్తాయి. దీంతోపాటు స్కిన్ అందంగా మెరిసేలా చేస్తుంది.

గమనిక:ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి.